### ❖ కాంగ్రెసోళ్లు ఓట్లకోసం రాజకీయం చేస్తున్నరు



హాజీపూర్, నవంబర్ 20 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటున్నరు. భూస్వాములు తప్ప.. మా లాంటి రైతులు పెట్టుకోవడం సాధ్యం కాదు. మూడున్నర ఎకరాలు భూమి ఉన్న నేను 3-4 హెచ్‌పీ మోటారు వాడుతా. 10హెచ్‌పీ మోటా రు పెడితే చుక్క నీళ్లుండవు. ప్రెషర్‌కు పంటతో పాటు భూమి కూడా కొట్టుకుపోతది. కాంగ్రెసోళ్లు ఓట్ల కోసం రైతులతో రాజకీయాలు చేస్తున్నరు. వ్యవసాయం మీద అవగాహన లేనోళ్లు గిట్లనే మాట్లాడుతరు. తెలిసీ తెలియని కాంగ్రెసోళ్లను ఎవ్వరూ నమ్మరు. **- ఎనగందుల నందయ్య, రాజేశ్వర్‌రావుపల్లె**

### ❖ ఓట్లప్పుడు వచ్చి చెబితే నమ్ముతమా?



భీమారం, నవంబర్ 20 : కాంగ్రెసోళ్లకు రైతులు బాగుపడటం ఏమ్రాతం ఇష్టముండదు. కాంగ్రెస్ పార్టీ చెప్పినట్లు మూడు గంటల కరెంటిస్తే ఎవుసం మళ్లా మూలకు పడ్డట్లే. మా లాంటి రైతులకు అన్యాయం జరుగుతది. అదే ఇప్పుడున్న 24 గంటల కరెంట్‌తో 5 హెచ్‌పీ మోటర్లు పెట్టుకొని మంచిగ ఎవుసం చేసుకుంటున్నం. రాజుల్లాగా బతుకుతున్నం. బతికున్నంత కాలం కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదు. వాళ్లు ఎన్ని చెప్పినా పట్టించుకోం. గిన్నేండ్లు పాలన చేసి ఏం చేసిన్రు. ఓట్లప్పుడు వచ్చి మోసం చేయాలని చూస్తున్నరు. **- తగరం రాజారాం, రైతు, భీమారం**




# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

## వ్యవసాయానికి మూడు గంటలెట్లా సరిపోతది

# కరెంట్‌పై కాంగ్రెస్‌ది కుట్ర

- 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుమంటున్నరు.. మరి డబ్బు లెవ్వడియ్యాలె?
- మాపై ఎందుకింత కక్ష..
- కాంగ్రెస్ తీరుపై అన్నదాతల ఆగ్రహం
- 24 గంటల కరెంటిచ్చే బీఆర్‌ఎస్‌నే గెలిపించుకుంటమంటున్న భూమి పుత్రులు

మంచిర్యాల (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ) : ప్రజల విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ ఎన్నికల్లో ఎలాగైనా లబ్ధి పొందాలని తప్పుడు హామీలు.. ఝూటా మాటలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓ నాయకుడు ధరణి పోర్టల్‌ను తీసివేస్తామని, మరొకడు 24 గంటల ఉచిత విద్యుత్ అవసరం లేదని.. మూడు గంటలే సరిపోతుందని, 10 హెచ్‌పీ మోటర్లు వాడాలని మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారంటూ మండిపడుతున్నారు. సీఎం కేసీఆర్ 24 గంటల కరంట్‌తో వ్యవసాయాన్ని పండుగలా మార్చగా.. హస్తం పార్టీకి కళ్లు మండుతున్నాయంటూ దుమ్మెత్తిపోస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం రైతుబంధు, రైతుబీమా, ధరణి పోర్టల్‌లాంటివి అమలు చేస్తుండగా, ఈ పథకాలను రద్దు చేసి వాటి స్థానంలో కొత్త పథకాలు అమలు తీసుకొస్తామంటూ మోసపూరితమైన మాటలు చెబుతుండడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. నిరంతరాయంగా అందుతున్న కరంటుతో రైతులు మూడు పంటలు పండించుకొని ఆర్థికంగా బలపడుతున్నారు. కాంగ్రెస్ పాలనలో పగలు, రాత్రి అన్న తేడా లేకుండా రైతులంతా పంట పొలాల్లోనే కాపు కాసేవారు. అర్ధరాత్రి కరంటు కోసం వెళ్లి అనేక మంది రైతులు పాము కాటుకు గురై మరణించిన ఘటనలు అనేకం. కరంటు కోసం రోడ్డెక్కి ధర్నాలు, రాస్తారోకోలు చేసేవారు. కానీ తెలంగాణ ఏర్పడి కేసీఆర్ సీఎం అయిన తర్వాత వ్యవసాయ స్వరూపమే మారిపోయింది. సాగుకు నిరంతర ఉచిత విద్యుత్‌ను అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ కీర్తిగడించింది. దీనిని జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు కుట్రలకు దిగుతున్నారు. కాంగ్రెసోళ్లు ఎన్ని కుట్రలు చేసినా.. వారి ఝూటా మాటలను ఎవరూ నమ్మరని, 24 గంటల కరంటు ఇచ్చే బీఆర్‌ఎస్ సర్కారునే మళ్లీ గెలిపించుకుంటామని భూమి పుత్రులు స్పష్టం చేస్తున్నారు.



### రేవంత్‌కేంది.. బాధపడేది రైతులే కదా

లక్షెట్టిపేట, నవంబర్ 20 : అసలు 10 హెచ్‌పీ మోటర్ పెట్టుడంటే.. రేవంత్ రెడ్డి ఎమనుకుంటుండో అర్థం అయితలేదు. అసలు తెలిసి.. మాట్లాడుతున్నడా.. తెల్వక మాట్లాడుతున్నడో తెలుస్తలేదు. 10 హెచ్‌పీ మోటర్ అంటే రూ. లక్షకు పైగానే ఉంటది. చిన్నకారు.. సన్నకారు రైతులు దాన్ని కొనుక్కొని ఏం చేసుకోమంటడో ఆయనే చెప్పాలి. ఇప్పుడు 3 లేదా 5 హెచ్‌పీ మోటర్లు ఓ ఐదు గంటలు పెడితేనే నీళ్లన్నీ అడుగంటుతున్నయి. అదే 10హెచ్‌పీ పెడితే బాయిలల్ల నీళ్లు పది నిమిషాల్లోనే తోడి పాడేస్తయి. రైతులు మర్చిపోతే అది కాలి బూడిద కావాల్సిందే. బాధపడేది రైతులే.. రేవంతు రెడ్డికేంది వంద మాట్లాడుతడు. నరంలేని నాలుక కదా. అసలు దేని మీద అవగాహన లేకుండా మాట్లాడుతడు ఈ రేవంతురెడ్డి. ఈయన ఒక్కడే కాదు కాంగ్రెస్ పార్టీ బడా నాయకులంతా అంతే. అక్కరకు రాని హామీలు చెప్పుకుంట రైతులను మోసం చేద్దామని చూస్తున్రు. **- దూడ శంకర్, మోటర్ మెకానిక్, లక్షెట్టిపేట**



### కాంగ్రెసోళ్లను నమ్మితే ఆగమే

హాజీపూర్, నవంబర్ 20 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రైతులకు 24 గంటల కరెంటు ఇస్తుంది. అదే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 3 గంటలే ఇస్తదట. కాంగ్రెసోళ్లు కరెంట్ కోసం ఎంత నరకం చూపించిన్రో ఇంకా మరచిపోలేదు. కరెంటు ఎప్పుడు వచ్చేదో.. పోయేదో తెలిసేది కాదు. రాత్రి పూట పొలాలకు నీళ్లు పెట్టేందుకు పోతుంటే పాములు, తేళ్లు కుట్టి మస్తు మంది చనిపోయిన్రు. తెలంగాణ సర్కారు వచ్చినంక రైతులకు 24 గంటల కరెంటు ఇస్తున్రు. దీంతో పంటలు పుష్కలంగా పండుతున్నయి. కాంగ్రెసోళ్లకు అధికారం ఇస్తే రైతుల బతుకులు ఆగమైతయి. **- ఏనుగు సత్యనారాయణ రెడ్డి, రాజేశ్వర్‌రావుపల్లె**



### 10హెచ్‌పీ మోటర్లు ఎవ్వరూ వాడరు

దండేపల్లి, నవంబర్ 20 : మాది దండేపల్లి మండలం కొత్తమామిడిపెల్లి గ్రామం. నాకు పదెకరాల వ్యవసాయం ఉంది. కాంగ్రెస్ పార్టీ వాళ్లు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటున్నరు. భూస్వాములు తప్ప ఎవ్వరూ ఈ మోటర్లు వాడరు. 10 ఎకరాలు ఉన్న నేను కూడా 3-5హెచ్‌పీ మోటారు వాడుతా. 10హెచ్‌పీ మోటారు వేసిన తర్వాత ప్రెషర్‌కు పంటలు కూడా కొట్టుకుపోయే పరిస్థితి ఉంటుంది. సన్నకారు, చిన్న కారు రైతులు 10హెచ్‌పీ మోటార్లు వాడరు అనే విషయాన్ని వాళ్లు గుర్తించాలి. కాంగ్రెస్ వాళ్లు ఓట్ల కోసం రాజకీయాలు చేస్తున్నరు. వ్యవసాయం మీద అవగాహన లేనోళ్లు ఇలా మాట్లాడుతరు. 24 గంటల కరెంటు ఇస్తున్న తెలంగాణ సర్కారుకు రైతులకు అండగా ఉంటరు. **-అక్కల శంకరయ్య, కొత్తమామిడిపెల్లి**

### మూడు గంటల కరెంటెట్ల సరిపోతది



చెన్నూర్, నవంబర్ 20 : తెలంగాణ రాష్ట్రం వచ్చినంక సీఎం కేసీఆర్ సార్ 24 గంటల కరెంటు ఇస్తున్నడు. ఈ 24 గంటల కరెంటుతో రైతులు ఎలాంటి తిప్పల్లేకుండా ఎవుసం చేసుకుంటున్నరు. కాంగ్రెసోళ్లు గెలిస్తే మూడు గంటల కరెంటు ఇస్తమని, రైతులు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని చెప్తుతున్రు. మాకాడ 3 లేక 5హెచ్‌పీ మోటర్లకే బోర్లు పోస్తయి. వాళ్లు చెప్పినట్టు 10 హెచ్‌పీల మోటర్లు పెట్టితే బోర్లే పోయవు. బోర్లు పోయనప్పుడు పంటలకు నీరు ఎలా అందుతుంది. కాంగ్రెసోళ్లు తెలిసి మాట్లాడుతున్నారా? తెలియక మాట్లాడుతున్నారా? అర్థం కావడం లేదు. ఇప్పుడు ముగ్గురు, నలుగురు రైతులకు కలిపి 3,5 హెచ్‌పీ మోటర్లు నడిచే విధంగా కరెంటు ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. కాంగ్రెసోళ్లు చెప్పినట్లు 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకుంటే ఎక్కడికక్కడ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయి. మాకు సీఎం కేసీఆర్ సార్ ఇస్తున్నట్లు 24 గంటల కరెంటు కావాలి. మేము 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోము. **- గాదె రమేశ్, కత్తరశాల**

### కాంగ్రెసోళ్లను నమ్మితే ఉన్న కరెంట్ పోతది

చెన్నూర్ రూరల్, నవంబర్ 20 : నేను 45 ఏండ్ల సంది ఎవుసం చేస్తున్న. కాంగ్రెస్ పాలనలో ఒక్క రాత్రి పూట అట్లట్ల కరెంట్ ఉండేది. ఎప్పుడు వచ్చేదో.. ఎప్పుడు పోయేదో తెలిసేది కాదు. ఇక ఎవుసానికి ఏదో ఒక కారణం చెప్పి దొంగ రాత్రి గంట, లేదా రెండు గంటలు కరెంట్ ఇచ్చేది. ఇచ్చే రెండు గంటల త్రీఫేజ్ కోసం కూడా అష్టకష్టాలు పడ్డం. ఇక ఏదైనా సమస్య వస్తే వారం దాకా త్రీఫేజ్ కరెంట్ ఉండకపోయేది. ఇక ఇండ్లళ్లకు అయితే వారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం దాకా కటింగ్ పెట్టేటోళ్లు. మరో వారం పొద్దటి నుంచి మధ్యాహ్నం దాకా కటింగ్ పెట్టేది. ఒక్క రోజు కూడా 24 గంటల కరెంటిచ్చింది లేదు. తెలంగాణ వచ్చినంక కరెంట్ కష్టాలే లేవు. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మితే.. ఉన్న కరెంట్ కూడా పోతది. జాగ్రత్తగా ఉండాలి. **- గర్రెపల్లి రాజమల్లు, కొమ్మెర రైతు**



### ❖ నమ్మితే పాత కథే..



ధరణిని తొలగిస్తామని కాంగ్రెసోళ్లు చెబుతున్నరు. రైతు వ్యతిరేక విధానా లు ఆ పార్టీ వాళ్లకు మామూలే. తెలంగాణ రాక ముందు పట్వారీ వ్యవస్థ ఉండే.. పైసల కోసం ఇష్టం వచ్చినోళ్ల పేర్ల మీద భూములు మార్చేటోళ్లు. అరిగోస పెట్టేటోళ్లు. ఇప్పుడు వాళ్లని నమ్మితే మళ్లా పాత కథే అవుతుంది. ధరణితో రైతులకు మేలు జరుగుతుంది. ఇట్లా పోయి.. అట్లా పని చేసుకొని వస్తున్నం. **- జునుగురి శంకరి, ఎలుకపల్లి, పెంచికల్‌పేట్ మండలం**

### ❖ రైతులు కూలీలైతరు..



ధరణిని తొలగిస్తే మళ్లీ పాత రోజులే వస్తాయి. పహణీల కోసం రోజుల తరబడి తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తది. లంచాలు ఇవ్వాల్సి వస్తది. ఆ పార్టీని నమ్మి కష్టాలు కొని తెచ్చుకోవడం దేనికి.. ఏం డ్లకేండ్లు నష్టపోయినం. మళ్లా నమ్మితే రైతులంతా కూలీ పనులకు పోవుడే అయితది. గందుకే మేమంతా బీఆర్‌ఎస్ సర్కారు వెంటే ఉంటం. **- రమేశ్, ఎల్లూరు, పెంచికల్‌పేట్**

### ❖ రైతులను మోసం చేసే కుట్రలు



తాండూర్, నవంబర్ 20 : కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేసేందుకు కుట్రలు చేస్తున్నది. 10 హెచ్‌పీ మోటర్లు భిగిస్తే బోర్లలో ఊట తగ్గుతది. మోటర్లు మోతాదుల పోస్తేనే వచ్చే పాలం పారుతది. మేము కూరగా యల పంట సాగు చేస్తుంటాం. 5 హెచ్‌పీ మోటర్ సరిపోతుంది. మూడు గంటల కరెంట్ అంటే రైతులు ఆగం కావడం ఖాయం. **- చీర్ల అశోక్, రైతు, కొత్తపల్లి**

### ❖ కేసీఆర్‌తోనే రైతులకు మేలు



చెన్నూర్ టౌన్, నవంబర్ 20 : తెలంగాణ ప్రభుత్వం రైతుల కష్టాలు తీర్చింది. 24 గంటల నాణ్యమైన కరెంటు ఇస్తున్నది. సకాలంలో ఎరువులు, విత్తనాలు అందజేస్తున్నది. రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీవంటి పథకాలతో మేలు చేస్తున్నది. నాకు ఐదెకరాలు ఉన్నది. ప్రస్తుతం సరిపడా కరెంటు ఉంటుండడంతో పంటలకు ఎలాంటి ఇబ్బంది లేదు. పండించిన పంటను కూడా మద్దతు ధరకు కొని ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నరు. రైతులకు మూడు గంటల కరెంటు ఇస్తమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అంటున్నడు. కాంగ్రెస్ కాలంలో కరెంటు ఎప్పుడు వచ్చేదో, ఎప్పుడో పోయేదో తెల్వక ఇబ్బందయ్యేది. ఉచిత విద్యుత్ ఇస్తున్న కేసీఆర్ సార్‌తోనే రైతులు మంచిగ ఉంటరు. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మేది లేదు. **- టంకసాల వామన్‌రావు, రైతు, చెన్నూర్**

### ❖ పొద్దున రిజిస్ట్రేషన్.. మాపటికే పాసుబుక్



జైపూర్, నవంబర్ 20 : ఇప్పుడు ధరణితో పొద్దుగాల రిజిస్ట్రేషన్ అయితే.. మాపటికే పాసుబుక్ నంబర్, డూప్లికేట్ బుక్ చేతికస్తంది. ధరణిలో దళారులు లేకుండా నేరుగా పనులైతన్నయి. గతంతో భూమి రిజిస్ట్రేషన్ కాగా.. ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు పట్వారోళ్ల చుట్టూ తిరుగాల్సి వచ్చేది. కాంగ్రెస్ వస్తే ధరణి తీసేస్తమంటండ్లు.. కాంగ్రెస్ పాలనలో బతికినోళ్లు ఎవరు. రైతులను అరిగోస పెట్టుకున్నరు. మళ్లా నమ్మేదే లేదు. కాంగ్రెస్‌ను అస్సలు రానీయం. **-అల్లాడి చంద్రయ్య, రైతు, ఇందారం**

### ❖ అది అనాలోచిత నిర్ణయమే



ధరణిలో మళ్లీ కౌలు రైతుల కాలం చేరిస్తే పట్టాదారులకు ఇబ్బందులు తప్పవు. వయసు మీదబడి స్వయంగా వ్యవసాయం చేసుకునే రైతులు తమకు ఉన్న కొద్ది పాటి భూమిని కౌలుకు ఇచ్చుకొని దాంతో వచ్చే డబ్బులతోనే కాలం గడుపుతున్నరు. కాంగ్రెస్ కౌలు రైతుల కాలం తీసుకువస్తే.. ఆ భూములను కౌలు రైతులు తమ పేర్ల మీద మార్పు చేసుకునే ప్రమాదం ఉంటుంది. అది అనాలోచిత నిర్ణయమే. **- ఉప్పరి సత్యనారాయణ, పెంచికల్‌పేట్ మండలం**

### ❖ ధరణితో రైతులకు మేలు



చెన్నూర్ రూరల్, నవంబర్ 20 : సీఎం కేసీఆర్ రైతుల మేలు కోరే మనిషి. అన్ని విధాలా ఆలోచించే ధరణిని తీసుకొచ్చిండు. ఏ ఒక్కరికీ అన్యాయం, నష్టం జరుగకుండా ఉండాలనే ముందు చూపుతోనే ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చిండు. ఈ యాప్‌తో ఏ ఒక్క రైతు నష్టపోలేదు. ధరణి లేక ముందు రైతులు ఎంతో ఇబ్బంది పడ్డరు. రిజిస్ట్రేషన్ల కోసం రైతులంతా ఆఫీసుల చుట్టూ తిరిగేటోళ్లు. ఆ సారు లేడట, ఈ సారు లేడట అని చెప్పేది. ఇప్పుడు మీ సేవ వెళ్లి దరఖాస్తు పెడితే డైరెక్ట్ పని అవుతుంది. ధరణితో రైతులంతా సంతోషంగా ఉన్నరు. **- దోమకొండ సునీల్, చెన్నూర్**

# ధరణి పోర్టల్‌ను తీసేస్తే.. దళారీ వ్యవస్థ..

## కాంగ్రెస్ కుట్రపై మండిపడుతున్న రైతాంగం

- భూ'మేత' పేరిట భూములు హాంఫట్ చేసే ఎత్తుగడ అంటూ ఆగ్రహం
- భూ సంస్కరణలు సమాధి చేసి ఆగం చేసేందుకేనంటూ ఆందోళన
- పొరపాటున ఆ పార్టీకి ఓటేస్తే దళారుల దందేనంటూ భయం

మంచిర్యాల (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ) :ధరణి పోర్టల్ వచ్చాక వ్యవసాయ భూముల లెక్కలు పక్కాగా రికార్డుల్లోకి ఎక్కాయి. ఏళ్ల నాటి సమస్యలకు పరిష్కారం చూపించింది. రైతుకు ఉన్న మొత్తం భూమికి రైతుబంధు వచ్చిందంటే.. పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందంటే.. రైతు బీమా డబ్బులు వెంటనే ఖాతాల్లో పడుతున్నాయంటే అది ధరణి పుణ్యమే. పౌరసరఫరాల శాఖతో ధరణి ఖాతాలను, వ్యవసాయ శాఖ రికార్డులను అనుసంధానం చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. రైతు బంధు, రైతు బీమా, పంటల కొనుగోళ్లకు ధరణినే ప్రామాణికంగా తీసుకుంటున్నది. ఇలా అనేక ప్రయోజనాలున్న ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలుపుతామని కాంగ్రెసోళ్లు వ్యాఖ్యలు చేయడంపై తెలంగాణ రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. పంట భూముల్లో పంది కొక్కుల్లా పడి దోచుకునేటోళ్లు, రైతులను నట్టేట ముంచేటోళ్లను మళ్లా తీసుకురావాలని 'హస్తం' పార్టీ కుట్ర చేస్తున్నదంటూ మండిపడుతున్నది. ధరణిని తీసేసి భూ'మేత' పేరుతో భూములను హాంఫట్ చేసే ఎత్తుగడలు వేస్తున్నదని, వీఆర్వోల చేతుల్లో భూ రికార్డులు పెట్టి లంచాలు వసూలు చేసే దళారుల దందాను తీసుకురావాలని చూస్తున్నదని, మళ్లా ఆ పార్టీని నమ్మే పరిస్థితి లేదంటూ తెగేసి చెబుతున్నది. 'ఇప్పుడున్న ధరణితో భూములకు ఢోకా లేదని గుండెపై చేయి వేసుకొని హాయిగా ఉంటున్న అన్నదాతలను ఆగం చేసేలా దాన్ని రద్దు చేసి, రైతుల అరిగోస పెట్టిన వీఆర్వోలకే మళ్లీ పెత్తనం ఇస్తామని కాంగ్రెస్ చెబుతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పొరపాటున ఆ పార్టీకి ఓటేస్తే కాంగ్రెస్ హయాంలోని పాతరోజులు మళ్లొస్తయి. రైతు తన భూమిని తాను అమ్ముకోలేడు. అసలు పట్టాదారైన రైతుకు తెల్వకుండనే వాళ్ల భూమిని వేరేవాళ్ల పేరు మీద అధికారులే రాసిపడేస్తరు. వీఆర్‌ఏ రాసిందే రాత, గీసిందే గీత.. రైతుబంధు అర్హులకు రాకుండా అడ్డుకుంటరు. పదెకరాలకు రైతుబంధు పడాలంటే వచ్చే పైసల్లో సగం నాకు ఇవ్వాలని లంచాలు గుంజుతరు. రైతు భూమికి గ్యారంటీ ఉండదు. రైతుబంధు వస్తుందన్న నమ్మకం ఉండదు. గతంలోలాగే రెవెన్యూ ఆఫీసుల్లో లంచాలిస్తే చాలు ఎవ్వరి భూమైనా మారిపోతది. గడిచిన 60 ఏండ్లలో ఉన్న దరిద్రం మళ్లొస్తది. కాంగ్రెస్‌కు ఓటేస్తే గిదే జరుగుతది' అని రైతులు భయపడిపోతున్నరు. ఏ ఇద్దరు కలిసినా గిదే ముచ్చట మాట్లాడుకుంటున్నరు. ధరణే బాగున్నది. మన భూమిని మనం తప్ప వేరేటోళ్లు అమ్మలేరు. మనమే పోయి వేలి ముద్ర వేస్తే తప్ప పట్టాలో పేరు మారదు. రైతుబంధు, రైతుబీమా టంచన్‌గా వచ్చి పడుతయి. అందుకే ఎట్లా ఆలోచించినా కష్టాల్లోకి నెట్టే కాంగ్రెస్‌కు ఓటేసేది లేదు.. ధరణిని వదులుకునేది లేదని అన్నదాతలు అంటున్నరు. ధరణి రద్దుపై రైతుల అభిప్రాయాలు వారి మాటల్లోనే..



### ❖ పొలాల కాడ పండుడే..

మందమర్రి రూరల్, నవంబర 20 : రాష్ట్ర ప్రభుత్వంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తుండడంతో పుష్కలంగా పంటలు పండుతున్నయి. మోటర్లు, నాణ్యమైన విద్యుత్ ఉచితంగా అందుతుండడంతో సంతోషంగా ఉన్నాం. కాంగ్రెస్ వస్తే 10 హెచ్‌పీ మోటర్లు కొనుగోలు చేయాలి. మూడు గంటలే కరెంటు ఇస్తామనే వార్తలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్‌ను నమ్మితే మళ్లా మోసపోవుడే తప్ప ఏముండదు. పొలాల కాడ పండుడే అయితది. అందుకే మూడోసారి కేసీఆర్‌నే సీఎం చేసుకుంటం. **- పెంచాల రామయ్య, రైతు, పొన్నారం**



### ధరణి తీసేస్తే రైతులు ఆగమే

చెన్నూర్, నవంబర్ 20 : సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణి భూములకు పూర్తి రక్షణ కల్పిస్తున్నది. కాంగ్రెసోళ్లు అధికారంలోకి వస్తే ధరణి తీసేసి బంగాళాఖాతంలో కలుపుతమంటున్నరు. ధరణి తీసేస్తే రైతుల బతుకులు మళ్లీ ఆగమైతయి. ఇప్పుడు మా భూములు ఎక్కడికి పోవనే ధైర్యంతో ఉన్నం. ధరణిని తీసేస్తే మళ్లీ అధికారుల రాజ్యం వస్తది. ఇక వారు మాకు తెలువకుండానే మా భూముల రికార్డులు మర్చేస్తారు. మేము ఆఫీసుల చుట్టూ తిరాగాల్సి వస్తుంది. మళ్లీ పాత రోజులు వస్తయి. సీఎం కేసీఆర్ సార్ పెట్టిన ధరణి ఎప్పటికీ ఉండాల్సిందే. **- పూరెళ్ల మహేశ్, పారుపల్లి, కోటపల్లి**

### ధరణితోనే రైతులకు మేలు

హాజీపూర్, నవంబర్ 20 : ధరణితో రైతులకు మేలు జరుగుతుంది. తెలంగాణ రాకముందు ఉన్న పట్వారీ వ్యవస్థ వల్ల అనేక మంది ఇబ్బంది పడ్డరు. గతంలో భూమికి సంబంధించిన పహణీ కావాలంటే కూడా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరిగేవాళ్లం. పట్వారీ వ్యవస్థ ఉన్నప్పుడు పంట నష్టం జరిగినా, భూమిని రికార్డులకు ఎక్కియాలన్నా పైసల్ తీసుకునేవారు. భూమి కొని పట్టా చేసుకున్న తర్వాత దానిని రికార్డుల్లోకి ఎక్కించి మ్యుటేషన్ చేయించాలన్నా.. పటాదారు పాసుబుక్కు తీసుకోవాలన్నా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ధరణితో అప్పటికప్పుడే పనులు అయిపోతున్నయి. **-ఏనుగు తిరుపతిరెడ్డి, రాజేశ్వర్ రావుపల్లె**



### ధరణి లేకపోతే ఇబ్బందే

దండేపల్లి, నవంబర్ 20 : తెలంగాణ రాకముందు ఉన్న పట్వారీ వ్యవస్థ వల్ల మా తాత, మా నాన్న చాలా ఇబ్బంది పడ్డరు. అప్పట్లో పహణీ కావాలంటే కూడా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరిగేవాళ్లమని నాయిన చెపుతుండే. పట్వారీ ఉన్నప్పుడు పంట నష్టం జరిగినా, బ్యాంక్ లోన్ కోసం భూమి రికార్డులకు ఎక్కియాలన్నా ఖర్చు అవుతుండే. భూమి కొని పట్టా చేసుకున్న తర్వాత దానిని రికార్డుల్లోకి ఎక్కించి మ్యుటేషన్ చేయించాలన్నా..పట్టా పాసుబుక్కు తీసుకోవాలన్నా తహసీల్ కార్యాలయం చుట్టూ తిరగాల్సిందే. తెలంగాణ సర్కారు వచ్చినంక కేసీఆర్ సార్ ధరణితో ఒక్క దగ్గరే రిజిస్ట్రేషన్.. మ్యుటేషన్ చేసి ఒక్క రోజులోనే పాసుబుక్కు ఇస్తున్నరు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ధరణి మంచిదే. ధరణి లేకపోతే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతరు. **-ఎర్రం మల్లేశ్, తాళ్లపేట**



